# కాంగ్రెస్ వస్తే మళ్లీ అంధకారమే

- వ్యవసాయానికి మూడు గంటల కరెంటే ఇస్తమంటున్నరు
- వాళ్లను నమ్మితే రాత్రిపూట లైట్లు పట్టుకొని బాయికాడికి పోయే రోజులొస్తయి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్
- కథలాపూర్‌లో ప్రచారం



కథలాపూర్‌లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, పక్కన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, జడ్పీటీసీ, నాయకులు

కథలాపూర్, అక్టోబర్ 24: 'రాష్ట్రాన్ని, దేశాన్ని ఏండ్లకేండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదు. అందరినీ ఆగం పట్టిచ్చారు. కరెంట్ కోతలతో రైతులకు చుక్కలు చూపించారు. ఇప్పుడు మళ్లీ ఆగం చేసేందుకు వస్తున్నరు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటే చాలని ఆ పార్టీ అధ్యక్షుడు అంటున్నరు. నేనొక్కటే చెబుతున్నా.. వాళ్లను నమ్మితే తెలంగాణ మళ్లీ అంధకారం అవుతుంది. మళ్లీ పాతరోజులే వస్తయి. చేనుకు నీళ్లు పెట్టేందుకు రాత్రిపూట లైట్లు పట్టుకొని బాయికాడికి పోయే రోజులు, యూరియా, ఎరువుల కోసం క్యూలో నిలబడాల్సిన పరిస్థితులు వస్తయి. మళ్లీ ఆ బాధలు మనకు అవసరమా..? ఆలోచించండి' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కథలాపూర్ మండలకేంద్రంలో వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు మద్దతుగా మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో కలిసి ప్రచారం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. అనంతరం విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఎట్లా సరిపోతదో చెప్పాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో వ్యవసాయానికి సరిపడా కరెంటిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం ఐదు గంటల కరెంట్ ఇస్తున్నదని, దీంతో అక్కడి రైతులు ఆందోళనలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ మాటలు నమ్మితే పాతరోజులే వస్తాయని, రాష్ట్రం చీకట్లోకి వెళ్లిపోతుందని, వ్యవసాయ రంగం వెనక్కి వెళ్లిపోతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని తెల్లరేషన్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా' చాలా గొప్పదని, ఈ పథకం పేదలకు ఒక భరోసానిస్తుందని వివరించారు. ఇలా పేదలకు మేలు చేసేలా సరికొత్త పథకాలతో సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టో తయారు చేశారని చెప్పారు. పెన్షన్ల విషయంలో మనం చాలా క్లారిటీగా ఉన్నామని మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. పదేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రశాంతంగా ఉందని, తెలంగాణను ఆగం పట్టించేందుకు కాంగ్రెస్ నేతలు వస్తున్నారని మండిపడ్డారు. 'నేనొక్కటే అడుగుతున్నా.. వ్యవసాయానికి 24 గంటల కరెంటిచ్చే బీఆర్‌ఎస్ కావాలా..? మూడు గంటలు మాత్రమే ఇస్తామంటున్న కాంగ్రెస్ కావాలో.. రైతులు తేల్చుకోవాలి' అని సూచించారు. కాగా, అంతకుముందు కథలాపూర్ మండలకేంద్రంలో కేవలం వృద్ధులే ఒక బృందంగా ఏర్పడి ఇంటింటా ప్రచారం చేస్తున్న తీరును చూసి వినోద్‌కుమార్ సంతోషపడ్డారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్‌ఎస్ నాయకులు వర్ధినేని నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓటెయండి

- మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- జంగంరెడ్డిపల్లిలో ప్రచారం

ఇల్లంతకుంట, అక్టోబర్ 24: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటెయాలని మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రానికి రాగా, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జంగంరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు ఆచరణ సాధ్యం కాని పథకాలను ప్రచారం చేస్తూ, ప్రజలను మోసంచేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ మోసాలతో కూడుకున్న పార్టీ అని.. అభివృద్ధి అంటే బీఆర్‌ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. గ్రామాలను అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్



జంగంరెడ్డిపల్లి గ్రామంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే రసమయి

పార్టీని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే రాష్ట్రం మరోసారి అంధకారంలోకి వెళ్తుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి కర్ణాటక ప్రజలు ఆరు నెలలు గడవకముందే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా ఉందని గుర్తు చేశారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీ నుంచి పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణుతో పాటు ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ అన్నాడి అనంతరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండ్ర చందన్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చల్ల నారాయణ, సర్పంచ్ తూంకుంట శ్రీలత, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, నేతలు శ్రీనివాస్, రాజశేఖర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, బాలరాజు, బాబు, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి అలంకారంలో రాజరాజేశ్వరీదేవి

వేములవాడ టౌన్, అక్టోబర్ 24: విజయదశమిని పురస్కరించుకొని సోమవారం వేములవాడ రాజన్న క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్వీయుజ శుద్ధనవమి ఉపరిదశమి సందర్భంగా అర్చక సుహాసినులు అమ్మవారికి అభ్యంగనస్నానం చేయించారు. అనంతరం స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 9గంటలకు నిశీపూజ, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిశాయి.



మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

# వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 24: సిరిసిల్లలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజు సోమవారం ఆలయంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తిలకించారు. రాత్రి 9గంటలకు హంస వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సహిత శ్రీనివాసుడు ఆలయ పురవీధుల్లో విహరించారు. కాగా, మంగళవారం ఉదయం 8గంటలకు హోమం నిర్వహించగా, 9గంటలకు సింహ వాహనంపై స్వామివారు విహరించారు. సాయంత్రం అశ్వవాహనం, రాత్రి 9గంటలకు గజ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. తర్వాత శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారు ఆలయం నుంచి మానేరు తీరంలోని జమ్మిచెట్టు గద్దె వద్దకు అశ్వ వాహనంపై బయలుదేరగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు.



సిరిసిల్లలో అశ్వవాహనంపై విహరిస్తున్న శ్రీవారు, శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

# సీఎం కేసీఆర్‌ను కలిసిన రమేశ్ రెడ్డి



తిమ్మాపూర్, అక్టోబర్ 24: మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయ కార్యదర్శి మాదాడి రమేశ్ రెడ్డి జన్మదినం సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను సోమవారం ప్రగతి భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రి.. రమేశ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం కేసీఆర్‌తో బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయ కార్యదర్శి రమేశ్‌రెడ్డి

# ప్రగతిభవన్‌కు చేరిన పాదయాత్ర

- యువకుడికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కేటీఆర్

వీర్నపల్లి, అక్టోబర్ 24: బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావాలని వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన అజ్మీరా నవీన్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం ప్రగతి భవన్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను నవీన్ కలిసి పుష్పగుచ్ఛం అందించాడు. నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపిన అమాత్యుడు, తనకోసం సాహసాలు చేయవద్దని సూచించారు. పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్రంలో మూడోసారి సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని నవీన్‌కు తెలిపారు.



మంత్రి కేటీఆర్‌కు మొక్క అందిస్తున్న నవీన్

# ఎమ్మెల్యేకే మా మద్దతు

- చొప్పదండి నియోజకవర్గ మైనార్టీల ప్రకటన



ఎన్నికల్లో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గెలవాలని ప్రార్థన చేస్తున్న మైనార్టీలు

చొప్పదండి, అక్టోబర్ 24: రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కే తమ మద్దతు అని చొప్పదండి నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం బూరుగుపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను మైనార్టీలు మర్యాదపూర్వకంగా కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ, మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. నిరుపేద ఆడబిడ్డల పెళ్లికి షాదీముబారక్, రంజాన్ పండుగకు ఇఫ్తార్‌దావత్, బట్టల పంపిణీ, మైనార్టీల పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్లు, మసీదులలోని ఇమామ్, మౌజంలకు గౌరవ వేతనం, మైనార్టీ బంధు వంటి అనేక పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గెలుపొందాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు శుక్రొద్దీన్, కోఆప్షన్ సభ్యుల ఫోరం జిల్లా అధ్యక్షుడు షఫిక్ రహమాన్‌పాషా, జగిత్యాల ఫోరం అధ్యక్షుడు అజారుద్దీన్, గంగాధర, బోయినపల్లి కోఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, అజ్జు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అజ్జు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సుంకెపై అభిమానంతో కువైట్ నుంచి బూరుగుపల్లికి..

గంగాధర, అక్టోబర్ 24 : మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన దూలం రాజేశంగౌడ్ 15 ఏండ్లుగా కువైట్ వెళ్తున్నాడు. తెలంగాణ ఎన్నికల నగారా మోగిన సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై ఉన్న అభిమానంతో సెలవుపై స్వగ్రామం బూరుగుపల్లికి వచ్చాడు. బీఆర్‌ఎస్ పార్టీ, ఎమ్మెల్యే రవిశంకర్‌కు మద్దతుగా నెల రోజుల పాటు ప్రచారం చేసి, తన ఓటు హక్కును వినియోగించుకుని తిరిగి కువైట్ వెళ్తానని రాజేశంగౌడ్ తెలిపారు. కాగా, మంగళవారం రాజేశంగౌడ్ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను బూరుగుపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలువగా ఎమ్మెల్యే అభినందించారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు దూలం శంకర్‌గౌడ్, గడ్డం స్వామి, ఉత్కం మురళి తదితరులు ఉన్నారు.



బూరుగుపల్లిలో ఎమ్మెల్యే రవిశంకర్‌ను కలిసి మద్దతు తెలుపుతున్న రాజేశంగౌడ్